

# దేవుడు కరుణించాలి...

జగన్నాథం గదినుండి బైటపడే సరికి తొమ్మిదైంది. మెట్లు దిగి పర్సు చూచుకున్నాడు. పధ్నాలుగు రూపాయిలమీద కొంత చిల్లర పైకముంది. "జీతం రావడాని కింకా ఇరవై ఏడు రోజులుంది" అనుకున్నాడు. ఆ తర్వాత కొంచెం భయమూ వేసింది.

నెమ్మదిగా గాంధీనగరం చేరుకున్నాడు. హోటల్‌కి వెడదామా వొద్దా అనుకుంటూనే హోటల్లోకి వెళ్ళిపోయాడు. సర్వర్ని చూచిన తర్వాత మళ్ళా భయపడ్డాడు. కేవలం కాఫీకే ఆర్డరిచ్చేడు.

సిగరెట్టు తీసి ముట్టించేడు. బుర్రంతా గందరగోళంగా వుంది. చేతుల్తో మొహం తుడుచుకున్నాడు. కాఫీ వొచ్చింది. తాగేడు. మళ్ళా ఆలోచనల్లో పడిపోయేడు.

'ఈ జీవితానికి సుఖం లేదు' అని చాలా తడవ లనుకున్నాడు. అలా అనుకున్నప్పుడల్లా అతని గుండెల నిండా భయం నిండుకుంటుంది. అంత భయంకరమైన ఆలోచన

ఆరోగ్యానికి మంచిది కాదని గుర్తు కొచ్చినప్పుడు గాలిమేడలు కట్టేస్తాడు. అతను కట్టే గాలిమేడలు తమాషాగా వుంటాయి. భవిష్యత్తులో ఒకానొక రోజుని బ్రహ్మాండంగా వూహిస్తాడు. దానికి కొన్ని రంగులు పులుముకుంటాడు. కాసేపు వాటితో ఆడుకుంటాడు. తెలుసు — ఆ రంగులు కాసేపటిలో కరిగిపోతాయనీ, ఆ మేడలు కూలిపోతాయనీను.

ఏవిధమైన ఆలోచనలూ రాకూడదని అతను చేస్తోన్న ప్రయత్నం ఇంతా అంతా కాదు. ఎంత కమ్మటి ఆలోచనైనా కాసేపట్లో అతి భయంకరంగా మారిపోవడం అతని దురదృష్టమే.

హొటల్లో జనం రద్దీగా వున్నారు. గజిబిజిగా మాటలూ వినిపిస్తున్నాయి. ఐనా అతను అన్నింటికీ అతీతుడైనట్టు యీ వాస్తవ ప్రపంచానికి దూరంగా వెళ్ళి అతనికై నియమింపబడ్డ విషవలయంలో యిరుక్కుపోతున్నాడు. ఇదే... ... ఇదే అతనికి నచ్చనిది, అతను ద్వేషించేదీని.

చప్పున లేచాడు. కౌంటర్‌దగ్గర కొచ్చి బిల్లు చెల్లించాడు. బైటకు రాబోతూండగా అతనో మనిషిని చూచి బ్రేక్‌వేసినట్టు ఆగిపోయేడు. కాసేపు ఆశ్చర్యపోయేడు.

కనిపించింది చిదంబరం!

బక్కగా ఎర్రగా ఎత్తుగావుండే చిదంబరం రెండేళ్ళక్రితం బి. ఎ. లో అతనిక్లాసుమేటు. గోళ్ళుగిల్లుకుంటూ క్లాసుబైటనున్న రావిచెట్టు ఆకులు లెక్కపెడుతూ పాఠాలువినే చిదంబరం యిప్పుడు గొప్ప వ్యక్తి అయ్యేడని ఎవరో చెప్పగా విన్నాడు. ప్రయోజకులంతా మొదట్లో పిచ్చాళ్ళలానే కన్పిస్తార్ట!

సూటులో ముచ్చటగా వున్న చిదంబరం నల్లకారులోంచి దిగి ఆ హొటల్ తాలూకు "లాడ్జింగ్ కి దారి" తాలూకు మెట్లెక్కాడు.

వెళ్ళేప్పుడు జగన్నాథాన్ని చూశాడుగానీ, ఎంచేతో పలుకరించలేదు. చిదంబరం వెనక ఇద్దరు ఘరానా వ్యక్తులు వున్నారు. ముగ్గురూ హడావిడిగా వెళ్ళిపోయారు. వాళ్ళు మేడమెట్లెక్కిన తర్వాత నల్లకారూ కదిలింది.

పరాకుగా వున్న జగన్నాథం వేలు చురుక్కుమంది. సిగరెట్టు చివరంటావచ్చి వేలు కాలింది.

జగన్నాథం మనసు చివుక్కుమంది.

జగన్నాథానికి అసూయ ఎక్కువని జగన్నాథం అభిప్రాయం. అతని అభిప్రాయాల్పైన అతనికి నమ్మకం ఎక్కువ. చిదంబరం బాగుపడ్డాడు. దాన్లో దాగిన రహస్యమేవిటి? అది తెలుస్తే బాగుండి పోను,

కొందరు అదృష్టవంతు లుంటారు.. కొన్నాళ్ళపాటు ఆ అదృష్ట జాతకం కావాలని వాయిదా వేసుక్కూర్చుంటుంది. సమయం వొచ్చినప్పుడు వరదొచ్చిన గోదారిలా ఆ మనిషిని ముంచెత్తేస్తుంది.

చిదంబరం లాటి జాతకం తనకు వుంటే...

పేలవంగా నవ్వేడు జగన్నాథం. జగన్నాథం సర్వసాధారణంగా నవ్వడు. నవ్వితే అది నవ్వులానూ వుండదు. కొందరు నవ్వితే వెన్నెల చిందినట్టు వుంటుంది. నవ్వుకీ మనసుకీ సంబంధ ముంటుందిట. మనసు నిర్మలంగా నిశ్చింతగా వున్నప్పుడు నవ్వితే ఆ నవ్వు వెన్నెల్లా, మెత్తగా, ఎదటి వాడికి హాయిగా వుంటుంది.

అలా నవ్వాలని అతను చాలా మాట్లు ప్రయత్నించేడు.

— జగన్నాథం రోడ్డుమీద కొచ్చింతర్వాత అనుకున్నాడు — 'ఇప్పుడేం చేయాలి?' వెధవది ప్రతీది ఒక సమస్యే అని విసుక్కున్నాడు. మళ్ళా తనపైన తనే జాలి చెందాడు. జగన్నాథం బ్రతుకు తమాషాగా వుంటుంది. అతను యువకుడు. పెళ్ళికానివాడు, నిండా పాతిక సంవత్సరాలు లేనివాడు. అవునా? ఇంత పసివాడికి లక్ష సమస్యలా? మనిషిని చిత్రవధ చేసే భయంకరమైన సమస్యలా?

మూడు ప్రాణాలు తనని నమ్ముకున్నాయి. ఆ మూడు ప్రాణాలూ అతని ప్రాణంకంటె ముఖ్యమైనవి. వాళ్ళ వూళ్ళో అతనికి అమ్మవుంది. ఆవిడ వృద్ధురాలు. ఒక తమ్ముడున్నాడు. వాడు కోరికల కొండ. చదువుకుంటున్న కుర్రాడు. అభివృద్ధికి రావలసిన వంశోద్ధారకుడు. వాడి భవిష్యత్తు జగన్నాథం చేతుల్లో వుంది. ఈ పాయింటుకి జగన్నాథం మరో అప్పుడైతే సంతోషించేవాడు, గర్వించేవాడూను. కానీ — యీ దౌర్భాగ్యుడు మరో ఆశావాదికి ఏ విధంగా సాయపడగలడని ప్రశ్నించుకుంటే దిగులు మాత్రలు మింగినట్టే అవుతుంది.

సుగుణమ్మ అతనికి చెల్లెలు. పెళ్ళీడు కెదిగిన యువతి. అందాల రాశి. రతనాల బొమ్మ. కానీ ఆ బొమ్మ నోరులేని ఆడబొమ్మ. మూగపిల్లకి పెళ్ళేమిటి వల్లకాడు అని తీసిపారేసే అనేకమంది మహాతల్లుల మధ్య, తోటి యువతుల మధ్య జీవచ్ఛవంలా బ్రతుకుతున్న అభాగిని.

ఆ అభాగినీ జగన్నాథాన్నే నమ్ముకుంది. ఏ నాటికైనా అన్న నాకో దారి చూపించడా అని గంపెడాశతో, అవమానాన్ని భరించి మరీ కాలం గడుపుతోంది పిచ్చి చెల్లి!

చెప్పాలని వుంది — "ఈ దౌర్భాగ్యుడు నీకు అన్న. నువ్వు మూగపిల్లవు, నీకు సుఖంలేదు చెల్లీ! ఇంత విషంతిని చావు" అని. కానీ, చెప్పలేదు. తన గుండెల్లో తనే కత్తిని దింపుకునేంత సాహసం లేదు.

ఇంటికి పెద్దవాడుగా పుట్టుట.

ఆదివిష్ణు

తల పండిపోయేంత అనుభవం నీ నూనూగు మీసాల వయస్సులోనే రుచి చూడాలి. తట్టుకునే సత్తా వుంటే, జ్యేష్ఠుడివిగా పుట్టు–లేదూ–నీ అసమర్థతని పదిమందిలోనూ వొప్పేసుకుని నీ దారేదో నువ్వు చూసుకో. ఇలా అని జగన్నాథం ఓ మిట్ట మధ్యాహ్నపువేళ ఏమీ తోచక డైరీలో వ్రాసుకున్నాడు. దాని క్రిందే మరో వాక్యం ఎర్ర సిరాతో వ్రాసుకున్నాడు. 'నాకు ఆ సత్తాగానీ, అసమర్థత వొప్పేసుకునేంత చొరవగానీ లేవు. అందుకే నేనింత వెధవనౌతోంది.'

ఈ విషయాలేవీ మేరీకి తెలీవు.

మేరీలాంటి ఓ స్త్రీ తననింతగా గౌరవిస్తున్నదంటే ఆశ్చర్యం అనిపించడం లేదుగానీ విచారంగా వుంది. నిజమే.

నాన్న బ్రతికున్నరోజుల్లో సంసారం గుట్టుగా వుండేది. ఆయన అప్పులు చేసేవారని తెలీనిచ్చేవారుకాదు. అదిగో, అల్లా వుండాలి మనిషన్న తర్వాత. తనని చదివించేరు. అడిగినంతా యిచ్చేవారు.

బి. ఎ. థర్డు యియర్‌లో మేరీతో పరిచయం. అదో బంగారుకల! మేరీ తెలుగులో కవిత్వం వ్రాసేది. జగన్నాథం వ్రాసేవాడుకాదు. మేరీ చక్కగా పాడేది. జగన్నాథం పాడేవాడుకాదు.

చదువులో బ్రిలియంటుననబడే జగన్నాథం జీవితంలో దద్దమ్మ అవుతాడని ఎవరనుకున్నారు? మేరీతో చాలాసార్లు చెప్పాలనిప్రయత్నించేడు 'నేను దద్దమ్మని మేరీ!' అని. కాని చెప్పలేదు. చెప్పేందుకు అభిమానం అడ్డువచ్చేది.

మేరీ నవ్వుతే వెన్నెల చిందినట్టే వుంటుందిగానీ ఎందుకలా నవ్వుతుందో ఒక పట్టాన అర్థంకాదు. అర్థం కాకపోయినాపర్నే హాయిగావుండే ఆ నవ్వుని మళ్ళాచూడాలి.

ఈ రాత్రి మెయిల్‌లో మేరీ వొస్తుందిట. స్టేషన్లో కలుసుకోమని నిన్న వైరిచ్చింది. కలుసుకోవడమా వొద్దా అనే అంశం నిన్నటినుంచీ ఎటూ తేలకుండానే వుండిపోయింది. విషయంగా చూస్తే యిది చిన్న సైజుదే కావచ్చు. లోతుగా ఆలోచిస్తేమాత్రం గుండెదడ ఎక్కువై పోగలదు.

నాన్నగారు మూడు నెలల్లో స్వర్గస్థు లౌతారనగా ఓ వెన్నెల రాత్రి మనసు పరవశం చెందుతూండగా మేరీకో మాట ఇచ్చాడు– 'పెళ్ళంటూ చేసుకుంటే నిన్నే పెళ్ళాడుతాను' అని. తర్వాత పరిస్థితులన్నీ తారుమారయ్యాయి.

కులాలకే తల పగల కొట్టుకునేంత ప్రాముఖ్యం ఇచ్చే యీ రోజుల్లో మతాంతర వివాహం ఆ వెన్నెల రాత్రి తను చేసిన శపథమంత తేలికైన పని కాదు. ఇంటికీ, వంశానికీ 'పెద్ద దిక్కు' జగన్నాథం. జగన్నాథమే తప్పటడుగు వేస్తే, రేపొద్దున రెండు నిండు ప్రాణుల



ఉసురు తను కట్టుకోవలసి వస్తుంది. అందులో తండ్రి లేడు. ఆయనుంటే, తన బ్రతుకేదో తను చూచుకుని మిగతావాళ్ళ బాధ్యత ఆయన కప్పగించేవాడు.

అయితే–జగన్నాథం యీ పెళ్ళికో ఉపాయం ఆలోచించి పెట్టేడు. ఆచరించడం కొంచెం కష్టమే అయినా ఫలితం మాత్రం శ్రేయస్కరం. తనని నమ్ముకున్న ఇద్దరి బ్రతుకులూ ఓ దారికి తీసుకొచ్చిన పిదప మేరీని పెళ్ళాడేస్తే భయపెడుతూన్న 'వివాహ' సమస్య తీరినట్టవుతుందని అతని ఉద్దేశం. అందుకే నోటికొచ్చినట్టు వాయిదా వేస్తూ వొచ్చాడు అతని పెళ్ళికి. ఈ ఉపాయం మేరీకి చెప్పాలని వుందిగానీ, చెబుతే తన మొహం ముందే తన అసమర్థతని ఎద్దేవా చేస్తుందని భయం. పైగా, బాగా డబ్బున్న ఆసామి కూతురు మేరీ. కొంచెం తలతిక్క మనిషని గూడాజగన్నాథం అభిప్రాయం.

— వెనగ్గా వొచ్చిన కారు హారనువిని ఉలిక్కిపడి పక్కకి తప్పుకున్నాడు జగన్నాథం. కారుదూసుకుపోయింది. ఓ ముసలాయన జగన్నాథం పరాకుని హెచ్చరించాడు హేళనగా. సిగ్గుపడి పోయేడు జగన్నాథం.

తనునించున్న వీధిని గమనించిన తర్వాత తను చేయవలసిన మహత్తరమైన కార్యం గుర్తుకొచ్చింది. ఇప్పటి వరకూ ఆ విషయమై ఆలోచించనందుకు అతను బాధపడ్డాడు. ఇప్పటికైనా గుర్తుకొచ్చినందుకు తననీ, హడలుగొట్టిన కారాయన్నీ హెచ్చరించిన ముసలాయన్నీ అభినందించేడు.

ఆ వీధిలోంచి ఓ మనిషి వొస్తుంటే ఆయన్ను ఆపి అడిగేడు —

'ఇక్కడ రంగారావు గారిల్లెక్కడండీ?'

ఆ మనిషి ఓ తడవ జగన్నాథాన్ని ఎగాదిగా చూచి అడిగేడు :

'ఆయన్తో మీకేం పని బాబూ!'

ఇది తిక్క ప్రశ్నగా అనిపించినా జవాబు చెప్పక తప్పలేదు.

'ఆయన మా బంధువు.'

'అలాగా. అదిగో ఆ చివరంటూ వున్నదే పెంకుటిల్లు, అదే. నేనిప్పుడు అక్కడ్నుంచే వొస్తున్నాను. రంగారావు యింట్లోనే వున్నాడు.'

ఆ పెంకుటింటికి వెళ్ళేడు జగన్నాథం. ఆ యింటి ప్రహరీగోడ తలుపు ఓరగా తీసివుంది. అక్కడ నిలబడి లోపలకి తొంగిచూశాడు. ఇంట్లో మనుషులెవ్వరో వున్నట్టే వుంది. నెమ్మదిగా 'రంగారావుగారూ' అని పిలిచేడు.

లోపలనుంచి ఎవరో పలికేరు.

జగన్నాథం ఇంట్లోకి వొచ్చాడు. వచ్చినవెంటనే అతను చూచినదృశ్యం అతన్ని కలవరపెట్టింది. నలుగురు మనుషులు చీట్లాట ఆడుతున్నారు. వాళ్ళముందు డబ్బులగుట్టలున్నాయి. మరోమనిషి చింకిచాపమీద పోర్లా

పడుకున్నాడు. సిగరెట్టు పీకలూ, పెట్టెలూ గదినిండా చిందరవందరగా పడివున్నాయి.

"ఎవరండీ మీరు?" అన్నాడో వ్యక్తి నోటికి గుడ్డ అడ్డుపెట్టుకుని.

తాగడం నేరమన్నది నిజమేగానీ, తాగినతర్వాత తాగలేదని చెప్పుకుందికి తీసుకునే శ్రద్ధమాత్రం సహించడం కష్టం. జగన్నాథానికి అలా అనిపించింది.

జగన్నాథం తనని తను పరిచయం చేసుకున్నాడు. అది విన్న తర్వాత ఓ నలభై ఏళ్ళ నల్లటి వ్యక్తి—

"ఓ, మీరా! రండి. అలా కూర్చోండి" అన్నాడు మరో చింకి చాపని చూపిస్తూ.జగన్నాథం కూర్చోలేదు. మళ్ళా నల్లటివ్యక్తే అన్నాడు—

"నాపేరే రంగారావు."

అతను గళ్ళలుంగీ, చిరిగిన బనీనుతో వున్నాడు. అతని కళ్ళుఎర్రగా వున్నాయి. అతని మొహంనిండా గంట్లు పెట్టినట్టు మచ్చలూను. చూడగానే అనిపిస్తుంది వొట్టి రాక్షసుడని. జగన్నాథం చప్పగా చల్లారిపోయాడు. లోలోపల దేవుడితో నిష్ఠూరాలు పలుక్కున్నాడు.

మళ్ళా రంగారావే చెప్పాడు.

"మూడ్రోజుల క్రితం మీ వూరెళ్ళాను. పిల్లను చూచాను. నాకు నచ్చింది, మరి నేను నచ్చడం నచ్చకపోడం మీరు నిర్ణయించాలిట. నేనే మీ అఫీసుకి వొద్దామనుకుంటున్నాను. మీరే వొచ్చారు."

సుగుణ నచ్చిందని వినడం యిదే ప్రథమం. చాలా ఆనందించతగ్గ విషయమే కానీ రంగారావుకి నచ్చిందని వినగానే వొళ్ళుమండుకొచ్చింది. మూగపిల్లకి రెండో సమ్మంధమంటే గుడ్డికాని మెల్ల అనుకున్నాడేగానీ కేవలం గుడ్డి సంబంధమని యిప్పుడే తెలుసుకున్నాడు. అతనికింకా అక్కడ నించో బుద్ధికాలేదు. కదలబోయాడు కానీ రంగారావు వొదిలేట్టు కనుపించలేదు.

"మంగమ్మా! మా బావగారికి కొంచెం మజ్జిగ పట్రా" అన్నాడు.

ఈ వరసతో మరింత కుళ్ళిపోయాడు జగన్నాథం. మంగమ్మ మజ్జిగ పట్టుకొచ్చింది. తాగ బుద్ధికాలేదు. కానీ గ్లాసు తీసుకోక తప్పిందికాదు.

"ఇంటిది వున్నప్పుడూ మంగమ్మే పనిమనిషి" అన్నాడు రంగారావు.

మంగమ్మని చూడగానే పనిమనిషని కొత్త వాళ్ళు చెప్పలేరు. కట్టూ బొట్టూ అన్నీ లక్షణంగా, దివ్యంగా వున్నాయి. చీట్లాట రాయళ్ళకి విసుగనిపించింది. మిగిలిన ముగ్గురూ నిట్టూర్చారు. వాళ్ళ అవస్థ గమనించి తొరగా వెళ్ళిపోవాలనే ఉద్దేశంతో మజ్జిగ తాగబోయాడు జగన్నాథం. ఏదో తమాషా వాసన ఆ గ్లాసునుంచి రాగానే కడుపులో దేవినట్టయింది. కళ్ళు మూసుకుని విషం తాగినట్టు



తాగేశాడు. ఆపైన వొస్తానంటూ కదిలాడు.

"మరి మీ నిర్ణయ మేమిటో చెప్పారుగాదు." అన్నాడు రంగారావు.

"నేనీ వూళ్ళోనే వుంటాను. మరోనాడు చెప్తాను." అనేసి గది నుంచి బైటకొచ్చాడు. బైటకొచ్చిం తర్వాత గట్టిగా నిట్టూర్చాడు.

ఇప్పుడతనికి ఏడవాలనిపించింది. సుగుణని చూస్తూ చూస్తూ ఈ నరకంలో తోసేయడం తన కిష్టం లేదు. అమ్మా వాళ్ళు ఎలా యిష్టపడ్డారో మరి. మూగదైతే మాత్రం సుగుణ మన సెంత నవనీతం? తనకి గుర్తు— మనసు బాగుండక భోం చేయకపోతే నోరు తెరుచుకు అడగలేక కళ్ళనీళ్ళు పెట్టుకునేది సుగుణ. ఉదయమే తన కోసం వేన్నీళ్ళూ, కాఫీ వగైరాలూ అన్నీ అమర్చిపెట్టేది. తనెప్పుడైనా సుగుణకోసం యేదైనా పట్టుకొస్తే అమితానందంతో లేడిపిల్లలాగంతులేసేది నోరుంటే?— నోరుంటే చెప్పేది"మా అన్న దేవుడు, మా అన్న దేవుడూ" అని. అలాంటి పిచ్చితల్లికా యింత అన్యాయం చేయడం—వొద్దు.

మరి మూగపిల్లకి మొగుడెలా వొస్తాడోయ్ బడుద్ధాయ్ అని ఎవరో ఎందుకు, తన మనసే అడుగుతోంది. జవాబు చెప్పాలి. ఏమని చెప్పాలి? ఏది చెప్పాలి?

"చెల్లీ! నువ్వెందుకు పుట్టావసలు?"

గబగబా మెయిన్‌రోడ్డువెంట నడిచేడు. కృష్ణానదివేపు నడక సాగించేడు. బరాజ్ మధ్యగా వొచ్చి నదివేపు తొంగిచూచేడు. గంభీరంగా వుంది.పరవళ్ళు తొక్కుతోంది. గలగల శబ్దమూ చేస్తోంది. ఉన్నపళంగా యీ నదిలో కళ్ళుమూసుకు దూకేస్తే— దూకొచ్చు. తన కెవరూ లేకపోతే, తను ఎవరికీ కాకుండాపోగల ధైర్యముంటే దూకేయవచ్చు. ఒట్టిది. అప్పుడిహ దూకమన్నా దూకడు. అసలలాంటి కోరికా కలగదు.

వెనక్కి తిరిగాడు. వెళ్ళిపోతూ బెంగగా ఓ తడవ నదివేపు చూచేడు.

"పాపం! నిష్కారణంగా కృష్ణవేణమ్మకి ఆశపెట్టాను. ఏమనుకుంటుందో!" వేదాంతిలా నవ్వేశాడు.

నదికి దూరంగా వొచ్చేసిన తర్వాత అతనికో వెర్రి ఆవేశం కలిగింది. చప్పున రిక్షాని పిలిచేడు.

---

- డాక్టరు : "మీరేం భయపడద్దు. ఇదివరకు నాకూ ఇలాంటి జబ్బే వచ్చింది."

  రోగి : "నిజమే కావచ్చు గానండి, మీరు మంచి డాక్టరు దగ్గిరి కెళ్ళివుంటారు."

ఎస్కిమో హోటల్‌కి తీసుకెళ్ళమని చెప్పాడు. ఆ హోటల్లో తృప్తిగా భోంచేశాడు. బైటకొచ్చి కిళ్ళీ వేసుకున్నాడు. రెండు గోల్డ్‌ఫ్లేకు సిగరెట్టు పెట్టెలు కొనుక్కున్నాడు. మళ్ళా రిక్షా ఎక్కి రూమ్‌కెళ్ళిపోయాడు.

బట్టలు మార్చుకుని నడుం వాల్చే సమయానికి మధ్యాన్నం పన్నెండు గంటలయ్యింది. జీవితంలో తృప్తిని సాధించేద్దామన్న అతని ఊహకి నవ్వొచ్చింది. నవ్వేసుకున్నాడు. రెండు గంటల ప్రాంతాల నిద్రకి కళ్లు మూతలు పడ్డాయి.

● ● ●

సాయంత్రం నాల్గు గంటలకి మెలుకువ వొచ్చినా కావాలని చెప్పి మరో గంటసేపు పక్కమీద అల్లాగే పడుకున్నాడు. మెయిల్ బెజవాడ ప్లాట్‌ఫారమ్‌ని ఏడున్నర గంటలకి గాని వొదలదు. జగన్నాథం ఎనిమిది గంటలకి స్టేషన్ కెళ్ళాలని నిశ్చయించుకున్నాడు. ఆ వేళకి మేరీ వెళ్ళిపోయి వుంటుంది. రేపో ఉత్తరం రాసి పారేస్తే మరో రెండు మూడు నెలలవరకూ పెళ్ళి ప్రసక్తి రావడానికి వీలుండదు. కనీసం ఆ కొంత కాలమైనా ఏవిధమైన అలజడీ లేకుండా గడిపేయవొచ్చు. ఈలోగా చెల్లెలు పెళ్ళి జరిగిపోతే...

రంగారావు గుర్తుకొచ్చేడు. అతని చిరిగిన బనీను, గళ్ళ లుంగీ, చీట్లాట నేస్తాలూ, మంగమ్మ, అసహ్యమైన యిల్లూ, భయంకరమైన వాతావరణం – అన్నీ ఒక్క తడవ తన కళ్ళముందు తిరిగేయి. జగన్నాథం వొణికిపోయేడు. 'భగవంతుడనేవాడుంటే యీ సంబంధాన్ని తప్పించి మరో యోగ్యమైన సంబంధం చూపించ కూడదూ?'

ఇదే ఆలోచనలతో అతను పక్కమీంచి లేచాడు. స్నానం ముగించాడు. గదికి తాళంవేసి పార్కువేపు నడిచేడు. పార్కులో ఓ మూల పచ్చగడ్డిమీద కూర్చుండిపోయేడు.

ఎనిమిది గంటలగ్గాని అతను అక్కడ్నుంచి లేవలేదు. హోటల్లో భోంచేసిన తర్వాత స్టేషన్ రోడ్డు వేపు మెల్లిగా నడక ప్రారంభించాడు.

జీతం తాలూకు డబ్బులు ఇంకా అట్టేరోజు లొచ్చేట్టు లేవు. దానికి తోడు ఉదయం పిచ్చెత్తినట్టు డబ్బులు ఖర్చు పెట్టేశాడు. జాగ్రత్త పడితే ఆ ఖర్చుతో మూడు రోజుల వరకూ గడపవచ్చు.

జగన్నాథం యిలాటి పిచ్చిపనులు చాలా చేస్తాడు. చేసిన పిదప చింతిస్తాడు. ఈ ఆలోచన ముందే వుంటే ఎంత బాగుండి పోనూ అని దిగులు పడతాడు.

ఈ నెల్లో యింటికి యాభై రూపాయిలు పంపేడు. ఏం సర్దుకుంటారో ఎలా సర్దుకుంటారో. డబ్బుకోసం చాలా యిబ్బంది పడిపోతూన్నారు. ఈ మేరీతో పెళ్ళవుతే రేప్పొద్దున యీ ఉద్యోగం చేయక్కర్లేదసలు. వాళ్ళకున్న ఆస్తితో నాలుగు తరాల వరకూ జరుపుకోవచ్చు. కానీ, మేరీతో పెళ్ళి యింత త్వరలో అవశానికి వీల్లేదు. దురదృష్టవశాత్తూ మేరీ పరాయి మతస్థుల పిల్లైపోయింది! ప్చ్.

జగన్నాథానికి స్వార్థంలేకపోలేదు. కానీ—'నేనింత స్వార్థపరుడినైపోతున్నానేమిటీ' అనిపించిన మరుక్షణంలోనే చప్పున మారిపోతాడు. 'నేను నిస్వార్థుడిని. త్యాగజీవిని. కాదనడానికి ఎన్నిగుండెలుండాలి! నేను చేస్తున్నదంతా త్యాగం కాదూ' అని కోప్పడేస్తాడు.

స్టేషన్ దగ్గరపడుతూండగా అతని గుండె దడ ఎక్కువైంది. పాపం! అమాయకురాలిని మోసం చేశాను. ఏడున్నరకి వెళ్ళిపోయే మెయిల్ నా కోసం ఎనిమిది గంటలవరకూ వుంటుందా? రేపు ఉత్తరం వ్రాయాలి. 'జ్వరంతో పీడింపబడుతూన్న నేను ఎలాగో వీలుచేసుకుని స్టేషన్ కొచ్చేను. కానీ నీ రైలు వెళ్ళిపోయింది.'

ఆపద సమయములందు, అసత్య ప్రయోగం ఏమంత నేరం కాదుట. లేకపోతే మేరీ యెదుట నిలబడి, ఆమె అమాయకమైన కళ్ళల్లోకి చూస్తో తమ పెళ్ళి వాయిదాకి ఏమని కారణం చెప్పేది? చెల్లి పెళ్ళీ, తమ్ముడి చదువూ అయిన తర్వాత నిన్ను చేసుకుంటాను, అలా కాకుండా నిన్ను అర్జంటుగా పెళ్ళాడేస్తే మా అందరిగతీ అధోగతి అవుతుంది మేరీ! అని ఎంత జాలిగా చెప్పినా ఏం బాగుంటుంది? ఏమీ బాగోదు.

మేరీ తనకి కావాలి. ఇది మాత్రం నిజం. మేరీతో కాని పెళ్ళి పెళ్ళికాదు. ఇదీ నిజమే. అయితే యింత గట్టి నిజాన్ని, అభీష్టాన్ని పరిస్థితుల దృష్ట్యా కొన్నాళ్ళపాటు చంపుకోడం త్యాగం కాదూ?

ఈ ఆలోచన రాగానే అతని మనసు తేలిక పడింది. వీధి దీపం వెల్తుర్లో తన నీడ గంభీరంగా నడుస్తున్నట్టు చూచి ముచ్చట పడిపోయేడు. ఓమాటు తన ఉంగరాల జుత్తుని తమాషాగా వొత్తుకున్నాడు.

జగన్నాథం అందగాడని జగన్నాథం అభిప్రాయమే కాదు – మేరీ కూడా వొప్పేసుకుంది. ఇంత అందగాడు నిత్యం వ్యథలమధ్య, నిట్టూర్పుల మధ్య నలిగి పోడం ఆ భగవంతుడికి సరదా కాబోలు!

జగన్నాథం భగవంతుడిని తిట్టడు. కానీ – నిష్ఠూరాలు వేయడం అలవాటై పోయింది.

ప్లాట్‌ఫారమ్ టిక్కెట్టు తీసుకున్నాడు. ప్లాట్‌ఫారమంతా గాలించి తిరిగి వొచ్చేస్తూండగా మెయిల్ వొస్తున్నట్టు మైక్‌లో ఎనౌన్స్ చేయబడింది. ఉలిక్కిపడ్డాడు జగన్నాథం. తన ఖర్మకాలి యీ రోజు మెయిల్ గంట లేటుట. నవ్వుకున్నాడు జాలిగా.

వందల జనంలోనైనా మేరీని గుర్తుపట్టడం అతి తేలిక. మేరీ హంసలా నడుస్తో జగన్నాథం

నుంచున్న చోటికే వొచ్చింది. వచ్చి అన్నది–

'తెలుసు. నువ్వు నా కోసం తప్పని సరిగా వొస్తావని.'

ఇంతగా అభిమానించే మేరీనా మథ్యపరచడం అనుకున్నాడు జగన్నాథం.

'కులాసానా ?' మళ్ళా ఆమే అడిగింది.

అతను తలూపాడు.

'ప్రమోషన్ గట్రా...'

'వూహు... అంతా మామూలే.'

మళ్ళా మెయిల్ కదిలేంత వరకూ యిలా కుశల ప్రశ్నలు వేస్తే ఎంత బాగుంటుంది – అనుకున్నాడు.

'పెళ్ళెప్పుడు చేసుకుంటావ్ ?' మేరీ అడిగింది.

ఆమె కళ్ళల్లోకి తిన్నగా చూశాడు. ఆ కళ్ళూ అదే అడుగుతున్నాయి. చూపుమార్చి జేబులో చేయిపెట్టి ప్లాట్ ఫారమ్ చివర వరకూ చూస్తూ నించున్నాడు. అతని చూపుకి ఓ యువకుడు కనిపించేడు. అతను నవ్వుతూ విసురుగా తమ వేపే వొస్తూన్నాడు. అంతలో అన్నది మేరీ.

'వారే మా శ్రీవారు.'

జగన్నాథం నెత్తిమీద పిడుగు పడినట్లయింది. భయంగా మేరీవేపు చూసేడు.

'ఆయన్తో పిచ్చిగా మాటాడకు. ఒట్టి సెన్సిటివ్! చాలా గుంభనగా వుండు. విచారించకు. నీకూ నాకూ పొత్తుకుదరదు. ఈ జన్మ కింతేనని సరిపెట్టుకో. ఇప్పుడు గొడవమాత్రం చేయకు.'

జగన్నాథం ఏమీ వినిపించుకునే స్థితిలో లేడు. తన క్రింద భూమి రెండు చీలికలై తనని కిందికి లాక్కుపోతున్నట్టుంది.

మేరీ భర్త వొచ్చాడు. తనతో కరచాలనం చేస్తూ ఇంగ్లీషులో అన్నాడు—

'మిమ్మల్ని కలుసుకున్నందుకు సంతోషంగా వుంది. మేరీ మీ గురించి చాలా చెప్పింది. మిమ్మల్నిక్కడ చూచి రైలాక్కముందే పరుగెత్తుకొచ్చింది.'

జగన్నాథం సభ్యతకోసమైనా నవ్వక తప్పిందికాదు. మేరీభర్త రైలు కదిలేంతవరకు తమ సంసారం గురించే చెప్పాడు. మేరీ ఓ మూలగా స్తంభాన్ని అనుకుని జగన్నాథంవంక, ఆమె భర్తవంక శ్రద్ధగా చూస్తో నించుంది.

రైలు కదిలింది. జగన్నాథం చేయూపుతూనే వున్నాడు. మేరీభర్త తలుపుదగ్గర నవ్వుతూ నించునే వున్నాడు.

రైలు కనుమరుగయ్యింది.

జగన్నాథం అనుకున్నాడు– 'అడదాన్ని నమ్మరాదు' అని.

బరువుగా నడచి స్టేషను బైటకొచ్చాడు. తలంతా దిమ్మెగావుంది. ఏదో అజ్ఞాతశక్తి తన పీకని నులిమేస్తున్నట్టూ, వొంటిని కోసి నెత్తురు తాగుతున్నట్టూ వుంది. తూలుతూ నడిచేడు. జేబురుమాల్తో మొహాన్ని కసిగా రుద్దేసుకున్నాడు.

ఉదయం కృష్ణవేణమ్మకి ఆశ పెట్టిన సంగతి గుర్తుకొచ్చింది. ఆవేశంతో నదివేపు పరుగెత్తబోయాడు. కానీ కదిలేముందు తన నీడ భయంకరంగా కనిపించడంతో ఉలిక్కిపడి ఆగిపోయాడు. సరిగ్గా ఆ సమయానికి తనముందు ఓ రిక్షా ఆగివుంది. రిక్షాలోని చిధంబరం తనని చూచి పలుకరింపుగా నవ్వేడు.

మరోప్పుడైతే అతనిస్నేహభావానికి ముగ్ధుడై కృతజ్ఞత తెలుపుకునే వాడేను. కానీ యిప్పుడు జగన్నాథానికి మనసు స్వాధీనంలో లేదు. గడిచిపోయిన కథకీ, గడవబోయే జీవితానికీ సరిహద్దయిన 'వంచన' అనే పదాన్ని తర్కిస్తోంది.

'కమాన్ మై డియర్ బాయ్! హేవ్ ఎ లిఫ్ట్' అన్నాడు రిక్షాలోని చిదంబరం.

అన్యమనస్కంగా రిక్షా ఎక్కాడు జగన్నాథం. రిక్షా కదిలింది.

'ఇప్పుడు చెప్పు నీకథ' అడిగాడు చిదంబరం.

జగన్నాథం జేలగా అతనివేపు చూసేడు.

'నువ్వు నన్ను క్షమించాలి. ఉదయం పెద్దమనుషుల్తో బిజీగా వున్నాను. పలుకరించి నిన్ను అవమానపరచే దానికంటే చూడకుండా వున్నట్టు నటించడమే మంచిదనుకున్నాను. కాని అనుకున్నంతగా నటించలేకపోయాను. టేకిట్ ఈజీ'. మళ్ళా చిదంబరమే అన్నాడు.

'నిన్నర్థం చేసుకున్నా' జగన్నాథం నోరు తడిచేసుకున్నాడు.

'దెన్ థేంక్స్. ఊఁ... ...ఈ వూళ్ళో వుద్యోగం వెలగబెడుతున్నావన్నమాట.'

తలూపాడు జగన్నాథం.

'పెళ్ళయిందా ?'

'లేదు.'

'ఎవర్నైనా ప్రేమించావా ?'

'నే నెవర్నీ ప్రేమించను.'

నవ్వేశాడు చిదంబరం. తర్వాత అడిగేడు.

'భోంచేశావా ?'

ఏమన్నట్టు చూశాడు జగన్నాథం.

'ఏం లేదు. వాలకం చూస్తుంటే నిరాహారదీక్ష పూనినట్టుంది.'

'మరే. పుట్టెడు దిగుల్తో చచ్చేవాడు అలాగే కనిపిస్తాడు.'

'నిక్షేపంలాటి కుర్రాడివి. నీకు దిగులేమిటోయ్!'

'నన్ను విసిగించకు చిదంబరం.

---

- వైద్యంలో అమెరికావాళ్ళు చాలా గట్టివాళ్ళు, ఈ మధ్య పెన్సిలిన్‌కి కూడా మందు కనిపెట్టారు.

ఇంత దూరం తీసుకొచ్చావ్. థేంక్స్. ఇంత మా రూమ్‌కి పోతాను. రిక్షా ఆపించు.'

'వీల్లేదు. కలవక కలవక కలిశాం. నువ్విప్పుడే వెళ్ళిపోతానంటే నే నొప్పేది లేదు. నువ్వు మా ర్రూమ్‌కి ఆహ్వానించక పోయినా—ఈ ఒక్కరాత్రి మా లాడ్జింగ్‌లో గడుపు. మరెన్నాళ్ళకు కలుస్తామో.'

'కాదు. నన్ను పోనివ్వు.'

'ప్లీజ్. నా మాట తీసేయకు. ప్రాణ మిత్రులం గాకపోయినా కలిసి చదువుకున్నాం. ఉదయం నిన్ను నిర్లక్ష్యం చేసినందుకు నేనెంత పశ్చాత్తాప పడుతున్నానో తెలుసా?' అన్నాడు బాధగా చిదంబరం.

వెనక బెంచీలో గోళ్ళు గిల్లుకుంటో కూర్చునే చిదంబర్రం ఈ నాడింత మాటకారి అయ్యాడని తెలిసిం తర్వాత జగన్నాథం ఆశ్చర్య పోయేడు.


'జవాబు కావాలి జగన్నాథం. నువ్వు నన్ను క్షమించినట్టు భావిస్తే నువ్వీ రాత్రి నాతో గడపాలి. తప్పదు.' అన్నాడు.

జగన్నాథం ఏం మాటాడలేక పోయాడు.

— హోటల్ గదిలో చాలా హాయిగా వుంది. అయినా జగన్నాథం మదిలో కావల్సినంత 'గొడవ' వుంది.

'భోం చేశానన్నావ్. పోనీ యీ యాపిల్సయినా తీసుకో జగన్నాథం.' ప్రాధేయ పడుతూ అడిగేడు చిదంబరం.

'వొద్దు. నా మనసేం బాగో లేదు.'






'అవుతే నా దగ్గరో మందుంది. అది వాడు. వొంటికి మనసుకీ మహా మంచిది.'

జగన్నాథం తలెత్తి నిజమా అన్నట్టు చిదంబరం వేపు చూసేడు. చిదంబరం మేధావిలా నవ్వేశాడు. నవ్వు పూర్తయిన తర్వాత సూటు కేసులోంచి ఓ సీసా తీశాడు. దాని ఆకారం చూస్తూనే జగన్నాథం కలవరపాటు చెందేడు.

'భయపడకు తమ్ముడూ! రుచి చూడు' తలుపుదగ్గరగా వేసి వొచ్చి కూర్చున్నాడు చిదంబరం.

జగన్నాథం తాగడం ప్రారంభించేడు. చిదంబరం తాగుతూ మాటాడుతున్నాడు. తనెలా పెద్దవాడైందీ ఎన్ని తమాషాలు చేసి యింతప్రయోజకుడైందీ చెప్పేడు. మాయ చేసి బ్రతకడం తెలుస్తే లోకం సలామ్ చేస్తుందిట!

అలా అని చెప్పి నవ్వేడు. ఆ గ్లాసులో మరో తడవ మందు పోశాడు.—

'నాలుగేళ్ళ క్రితం ఓ దిక్కుమాలిన థియేటర్ తాలూకు గేట్ మాన్ కొడుకుని. ఇప్పుడు గ్రేట్ మాన్‌ని. ది గ్రేట్. నాలుగేళ్ళలో నువ్వు పొడిచిందేమీ లేదు. కారణం నీకు మాయచేయడం తెలీదు. చాతకాదు. తెలుగు సినిమారంగంలో నా పేరు వెలిగి పోతోంది. ప్రొడ్యూసర్ దగ్గర్నుంచీ ఎక్‌స్ట్రా వరకూ నా సలహాలు అడుగుతారు. పూర్ ఫెలోస్, వాళ్ళకి తెలీదు మానాన్న వట్టి గేట్ మాన్ అని' అని నవ్వబోయి ఆగి పోయేడు.

చిదంబరం మాటలు జగన్నాథం వినిపించుకోడంలేదు. తను ఎక్కడికో తేలిపోతున్నట్టుంది. నరాలన్నీ జివ్వున లాగుతున్నట్టుంది. గుండల్లో ఓ మూల ఆకాశమంత ఖాళీ ఏర్పడినట్టుంది. శరీరం యావత్తూ స్వాధీనం తప్పుతున్నట్టుంది.

సర్గ్గా ఆ వేళకి తలుపు శబ్దమైంది. చిదంబరం తలుపు తెరిచాడు. తెరిచిన వెంటనే—

'ఓ నువ్వా! ఎవరో అనుకుని మావాడు అదిరిపోయాడు. రా... లోపలికి.'

చిదంబరం వెంట ఓ యువతిలోపలికొచ్చింది. జగన్నాథాన్ని చూచి ఎవరన్నట్టు కళ్ళతో అడిగింది.

'ఈవిడ మిస్ కుసుమ. చక్కగా పాడుతుంది. ఇతను జగన్నాథమని మా క్లాసుమేట్. గొప్ప యాక్టర్.'

ఇద్దరికీ పరిచయం చేశాడు చిదంబరం.

కుసుమకి ఆమందుతో బాగా పరిచయమున్నట్టు—తనే స్వయంగా గ్లాసులో వొంచుకుని గుటగుటా తాగింది. తర్వాత గ్లాసులో మరి కొంచెం పోసుకుని ఆరగా ఆరగా తాగడం మొదలెట్టింది. జగన్నాథం ఆమెను అనుసరించేడు.

ముగ్గురూ చాలాసేపు చాలా విషయాలు మాటాడుకున్నారు. జగన్నాధానికి ఎలుగెత్తి ఎవర్నో పిలవా

లన్నంత వుత్సాహం వొచ్చిందిగానీ చిదంబరం వారించడంతో ఆగిపోయాడు.

● ● ●

ఉదయం నాలుగ్గంటలప్రాంతాల్లో జగన్నాథానికి మెలుకువ వొచ్చింది. తన పక్కనే అర్ధ నగ్నంగా పడుకున్న కుసుమని చూచి గట్టిగా కళ్ళు మూసుకున్నాడు. అప్పు డతనికి లీలగా, గడిచిన రాత్రి తన అనుభవం గుర్తు కొచ్చింది. గుర్తు కొచ్చిన కాసేపటికి కళ్ళల్లో నీళ్లు తిరిగాయి.

అక్కడే వున్న కుర్చీలో కూలబడిపోయి మొహాన్ని చేతుల్లో దాచుకుని కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నాడు. ఎక్కడినించి వొచ్చాడో సుడిగాలిలా వొచ్చేడు చిదంబరం. వొచ్చి లైట్ వేసి అన్నాడు—

"గుడ్ మార్నింగ్ బ్రదర్ !"

'... ... ... ...'

"ఛ. ఏడుస్తున్నా వెందుకోయ్?" దగ్గరిగా వొచ్చి జగన్నాథం భుజం కుదుపుతో అడిగేడు.

అతను మరింతగా కుదించుకుపోయాడు. చిదంబరం మెల్లిగా నవ్వి జోలపాట పాడేడు—

'ఏడవకు ఏడవకు వెర్రినా తండ్రీ!
ఏడిస్తే నీ కళ్ళు నీలాలు కారు,
నీలాలు కారితే నే చూడలేనూ...
జో ... జో.'

జగన్నాథం చివాలున లేచి నిలబడ్డాడు. గట్టిగా అరిచేడు.

"నామీద నీ కెందుకింత కసి? బాధల్లో ఛస్తున్నా నీతిగా బ్రతుకుతున్నాను. రాత్రి ఆ నీతికి స్వస్తి చెప్పించావ్. ఇది నీవల్ల జరిగింది. నువ్వే దీనిక్కారణం. నువ్వే చిదంబరం. నువ్వే."


ఈ అలజడికి కుసుమ కళ్ళు విప్పింది. భయంతో లేచి నిలబడింది. కుసుమని ఓదార్చాలనే ఉద్దేశంతో చిదంబరం అన్నాడు—

"దేరీజ్ నథింగ్ టు ఫియర్ మిస్ కుసుమా ! జస్ట్ మిసండర్ స్టాండింగ్. ఇలాంటి మనిషిని బాగు చేయడం నావల్లకాదు. నిన్న ఉదయం ఈ మంచివాడ్ని అవమానించాననే బాధ కొద్దీ చేరదీసి చక్కటి ఆతిథ్యమిచ్చి క్షమించమని కోరేను. నోటి కొచ్చినట్టు పేలేస్తూన్నాడు. మై డియర్ జగన్నాథం, గెటవే ఫ్రం హియర్. క్విక్. చాతకాని తనం చావనంత వరకూ నువ్వు బాగుపడవు. వెళ్ళు" అన్నాడు చిదంబరం గుమ్మంవేపు చేయిచూపుతూ.

— ఆ ఉదయం నుంచీ జగన్నాథానికి నీతి నియమాలపట్లు కొత్తరకమైన ఆలోచనలు ప్రారంభమయ్యాయి. అతని ఆలోచనల కుచ్చుల టోపీలో యిదో ముచ్చటైన రంగుటీక.

□□□





# అసలైన ఆత్మహత్య

కోఆపరేటివ్ స్టోర్సు సెక్రటరీ పదవినుంచి రంగనాధంగారు విరమణ చేసినట్లు రూఢి అవగానే - మంచివాళ్లు కాకపోయినా, మంచివాళ్ళమీద మంచి అభిప్రాయమున్న మనుష లందరూ హోరని ఏడ్చారు.

"ఒక రకం ప్రజా హృదయానికి ఒకడే నాయకుడు. ఒక యుగంలో ఒక సంఘానికి ఒకడే సంస్కర్త. ఇక ఈ సంఘానికి వైధవ్యం తప్పదు" అనుకుంటున్న ప్రజల మాట విని రంగనాధంగారు చికాకు పడ్డారు.

"ఈ రకం వ్యక్తిపూజ యిప్పుడున్న మహోపద్రవాలలో ముఖ్యమైనది. బానిసతనానికి ప్రథమ చిహ్నం—ఒక్క వ్యక్తి తొలగిపోతే, ఒక్క కెరటం విరిగిపోతే కాల సముద్రం ఆగిపోతుందా? మరొక మహత్తర వ్యక్తి రావచ్చు. ఇంతకు మించి కష్టపడవచ్చు. ముసిలివాణ్ణి. కాళ్ళున్నంత వరకు నడిచి వచ్చాను. కళ్ళున్నంత వరకు లెక్కలుచూశాను.